క్లుప్తంగా

గర్భిణులకు దివ్యౌషధం పంపిణీ



మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల క్షేత్రంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా గర్భిణులకు ఉచితంగా దివ్యౌషధాన్ని పంపిణీ చేశారు. ఏడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బలగం దర్శకుడు ఎల్దండి వేణు శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఏడేళ్లుగా ఉచితంగా దివ్యౌషధాన్ని పంపిణీ చేయడం గొప్ప దైవ కార్యమని పేర్కొన్నారు. దివ్యౌషధాన్ని తీసుకున్న వారికి నార్మల్ డెలివరీ అవ్వడం, బిడ్డ ఆరోగ్యంగా పుడుతున్నారని, స్వామి వారి దయ అపారంగా ఉందన్నారు. కార్యక్రమంలో బలగం వేణుతోపాటు ఇందూరు అన్నమయ్య నర్సింహారెడ్డి, ప్రతినిధులు రవీందర్, నర్సారెడ్డి, నరాల సుధాకర్, గంగారెడ్డి, అర్చక స్వాములు సంపత్ కుమారాచార్య, రోహిత్ కుమారాచార్య, తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై హత్యాయత్నం

రుద్రూర్ : రుద్రూర్ మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గణేశ్ (9) అనే బాలుడిపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి హత్యాయత్నం చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముఖానికి మాస్కులు వేసుకున్న నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు బాలున్ని బలవంతంగా స్థానికంగా పొలాల్లోకి ఎత్తుకెళ్లి పెట్రోల్ పోస్తున్న సమయంతో వారి నుంచి తప్పించుకున్నాడు. పరిగెత్తుకుంటూ వస్తుండగా కిందపడి స్పృహ కోల్పోయాడు. మధ్యాహ్నం నుంచి బాలుడు కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు వెతుకుతుండగా స్పృహ కోల్పోయిన బాలుడు కన్పించాడు. సదరు బాలుడిని లేపి ఏం జరిగిందని అడగగా తనను ఎవరో ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై శనివారం రాత్రి బాలుడి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవీందర్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడిని అప్పగించిన పోలీసులు



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రానికి చెందిన గాండ్ల శివప్రసాద్ అనే బాలుడు తప్పి పోవడంతో స్థానికులు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయాన్ని వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. దాంతో బాలుడి బంధువులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాలుడిని తీసుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. బాలుడి నానమ్మ వాళ్ల ఇంటికి ఆదివారం బంధువులు వచ్చారు. వారు తిరిగి వెళ్తుండగా ఆ బంధువుల ఆటో వెనకాలే బాలుడు పరిగెత్తాడు. ఈ విషయాన్ని ఆమె గమనించలేదు. బాలుడు పెద్దవాగు సమీపంలోని రైస్‌మిల్ వరకు ఆటో వెనక వెళ్లి అక్కడ ఆగిపోయాడు. దారి తెలియక రోడ్డుపై ఉండగా స్థానికులు గుర్తించి పీఎస్‌లో అప్పగించారు. అనంతరం బాలుడి చిన్నమ్మ లక్ష్మి, నానమ్మ రుక్కవ్వలు వచ్చి బాలుడిని తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



సిరికొండ : మండలంలోని చిన్నవాల్గోట్, పెద్దవాల్గోట్ గ్రామాల మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. చిన్నవాల్గోట్ గ్రామానికి చెందిన పులి జీవన్ బైక్‌పై పెద్దవాల్గోట్ వైపు నుంచి గ్రామానికి వెళ్తుండగా కారును ఓవర్‌టేక్ చేస్తుండగా బైక్ కారు ఢీకొనడంతో అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో జీవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. సంఘటన గురించి ఎస్సై నర్సింలును సంప్రదించగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నియామక ప్రక్రియకు వేళాయె..

- నేడు 'సమగ్ర శిక్ష'లో కాంట్రాక్టు ఉద్యోగులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్
- ఏర్పాట్లు చేసిన అధికారులు



ఆర్మూర్: విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా నిర్వహిస్తున్న సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల బదిలీలు, డిప్యుటేషన్ల పర్వం పూర్తి కాగా తాజాగా నియామకాల ప్రక్రియ ప్రారంభమైంది. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి బదిలీలకు నోచుకోని సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు పదేపదే కోరడంతో కేజీబీవీలతో పాటు జిల్లా, మండల విద్యా వనరుల కేంద్రం పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, ఐఈఆర్పీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిస్టం అనలసిస్ట్‌లు, ప్రోగ్రామింగ్ ఆఫీసర్లకు బదిలీలకు అవకాశం కల్పించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, సమగ్ర శిక్ష ఎక్స్ అఫీషియో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవసేన ఉత్తర్వులతో బదిలీల ప్రక్రియను ప్రారంభించారు. డీఈవో పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు, సూచనల మేరకు ఈ బదిలీలు పూర్తి చేశారు.

32 పోస్టులకు ప్రారంభమైన ప్రక్రియ

జిల్లా సమగ్ర శిక్ష పరిధిలో ఆరు ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, తొమ్మిది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 17 ఐఈఆర్పీలు, మొత్తం 32 పోస్టులు ఖాళీగా చూపిస్తూ కాంట్రాక్టు పద్ధతిపై విధులు నిర్వహించడానికి 2019 నవంబర్‌లో విద్యా శాఖ నోటిఫికేషన్ ఇచ్చి డిసెంబర్‌లో రాత పరీక్ష సైతం నిర్వహించారు. 2020 జనవరిలో జిల్లాల వారిగా మెరిట్ లిస్టులను ప్రకటించారు. అదే సమయంలో కరోనా వ్యాపించడంతో 2022 వరకు నియామకాల ప్రక్రియను నిలిపివేశారు. కోవిడ్ అనంతరం 2022 మార్చిలో ఈ కాంట్రాక్టు ఉద్యోగుల నియామకానికి విద్యాశాఖ మంత్రి అనుమతినిచ్చారు. అదే సమయంలో సీఎం కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాలు ఉండవని ప్రకటించడంతో ఈ నియామకపు ప్రక్రియను అర్ధంతరంగా నిలిపివేశారు. తాజాగా సమగ్ర శిక్ష కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రాజెక్టు కాబట్టి కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు చేస్తున్నామని పేర్కొంటూ రాష్ట్ర స్థాయి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2019 డిసెంబర్‌లో పరీక్షలో మెరిట్ సాధించిన వారిలో మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టనున్నారు. సోమవారం అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేయనున్నారు. అభ్యంతరాల అనంతరం ఈ నెల 7న ఫైనల్ జాబితాను ప్రకటించి ఈనెల 10వ తేదీ లోగా వీరు ఉద్యోగాల్లో చేరే విధంగా స్పష్టమైన ఉత్తర్వులను జారీచేశారు. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా నియామకపు ప్రక్రియ కొనసాగుతోంది.

14 మందికి బదిలీ..

జిల్లాలోని సమగ్ర శిక్ష పరిధిలో సుమారు 291 మంది కాంట్రాక్టు ఉద్యోగులు వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయి అధికారుల సూచన మేరకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ పద్ధతిలో బదిలీల ప్రక్రియ గత నెల 12వ తేదీకి పూర్తి కాగా జిల్లాలో ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, 11 మంది ఐఈఆర్పీలు మొత్తంగా 14 మందికి బదిలీలు జరిగాయి. వీరు గత నెల 13న బదిలీ అయిన మండలంలోని విద్యా వనరుల కేంద్రాల్లో విధుల్లో చేరారు.

డిప్యుటేషన్లు..

రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారుల ఉత్తర్వుల మేరకు బదిలీ అయిన కొత్త మండలంలో ఈ ఉద్యోగులు విధుల్లో చేరడంతో పాత మండలాల్లో పోస్టులు ఖాళీ అయ్యాయి. దీంతో రాష్ట్రస్థాయి అధికారుల సూచన మేరకు డీఈవో దుర్గాప్రసాద్ ఈ 14 మందికి తిరిగి పాత మండలంలోనే విధులు నిర్వహించాలని సూచిస్తూ డిప్యుటేషన్ ఉత్తర్వులను గత నెల 18న జారీ చేయడంతో వీరంతా తిరిగి పాత స్థానంలోకి వెళ్లి విధులు నిర్వహించడం ప్రారంభించారు..

తుది జాబితా ప్రకటిస్తాం

రాష్ట్ర స్థాయి అధికారులు ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారం జిల్లాలో వివిధ కేటగిరీల్లో 32 పోస్టుల్లో కాంట్రాక్టు పద్ధతిపై ఉద్యోగులను నియమించే ప్రక్రియ ప్రారంభించాం. ఇప్పటికే మెరిట్ లిస్టును ప్రకటించాం. అభ్యంతరాల అనంతరం రోస్టర్ పాయింట్స్‌ను కేటాయిస్తూ తుది జాబితాను ప్రకటిస్తాం.
– దుర్గా ప్రసాద్, డీఈవో, నిజామాబాద్

కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల



కాకతీయ కాలువలో నీరు

సాక్షి ఎఫెక్ట్..



సోయాపంటకు నీరందిస్తున్న మహిళా రైతు

- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- పంటలకు ప్రాణం పోస్తున్న నీరు

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా లీకేజీల రూపంలో 50 క్యూసెక్కుల నీటిని ఆదివారం ఉదయం ప్రాజెక్ట్ అధికారులు విడుదల చేశారు. పక్షం రోజుల నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టకపోవడంతో పంటలక నీరందక ఎండిపోతున్న వైనం పై 'సాక్షి'లో వరుస కథనాలను ప్రచురించమయ్యాయి. తాజాగా ఆదివారం 'ఎండుతున్న పంటలు' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు ఆదివారం కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను చేపట్టారు. దీంతో కాలువలో నీరు నిల్వ ఉంది. నిల్వ ఉన్న నీరు పంపు సెట్లకు అందుతుండటంతో రైతులు పంట భూములకు పంపు సెట్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా నీటిని పంపు సెట్ల ద్వారా పంటల భూములకు తరలించి, ఎండిపోతున్న సోయా, మక్క పంటలకు అందిస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టడంతో ఎండిపోతున్న పంటలకు ప్రాణం పోసినట్లయ్యిందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ కాలువ లీకేజీ నీటి విడుదల చేపట్టకపోవడం 'సాక్షి' వరుస కథనాలు ఇవ్వడంతోనే అధికారులు నీటి విడుదల చేపట్టరని, 'సాక్షి'కి ఆయ కట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధితోనే సమాధానం చెబుతా



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

- ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయి
- బీజేపీ అంటే జూటా పార్టీ
- కాంగ్రెస్ వాపును బలుపు అనుకుంటుంది
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్ : తాను నియోజకవర్గ అభివృద్ధి కోసం తాపత్రయ పడుతుంటే ప్రతిపక్ష నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, కానీ అభివృద్ధితోనే వారికి సమాధానం ఇస్తానని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని భీమ్‌గల్, ముచ్కూర్, బాబాపూర్ గ్రామాల నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన పలువురు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కర్ణాటకలో గెలుపుతో తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతమైందని భ్రమ పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ వాపును చూసి బలుపు అనుకుంటుందని విమర్శించారు. కాంగ్రెస్ పాలన ఏమిటో తెలంగాణ ప్రజలకు తెలుసని, కాంగ్రెస్ పాచికలు తెలంగాణలో పారవన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి ఏమీ చేయకపోయినా ఆ పార్టీ నేతలు అన్ని మేమే చేస్తున్నామంటూ అబద్ధాలు ప్రచారం చేసుకుంటున్నారని, బీజేపీ అంటేనే పెద్ద జూటా పార్టీ అని విమర్శించారు. తెలంగాణపై మోదీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులు గుజరాత్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలకు తరలిస్తుంటే ఇక్కడి బీజేపీ ఎంపీలు చోద్యం చూస్తున్నారని, తెలంగాణ ప్రజల ప్రయోజనాలు పట్టవా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటున్నామని, బాల్కొండలో జరుగుతున్న అభివృద్ధి కళ్ల ముందే కనిపిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మధుశేఖర్, రాజారాం యాదవ్, భీమ్‌గల్ మండల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడతో శారీరక దారుఢ్యం



క్రీడాకారులకు బెల్ట్‌లు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అసోసియేషన్ చైర్మన్ బస్వా లక్ష్మీనర్సయ్య

- తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ బస్వాలక్ష్మీనర్సయ్య

నిజామాబాద్‌నాగారం : తైక్వాండో క్రీడతో పిల్లల్లో శారీరక దారుఢ్యం కలుగుతుందని తైక్వాండో అసోసియేషన్ జిల్లా చైర్మన్ బస్వా లక్ష్మీనర్సయ్య తెలిపారు. ఆదివారం నగరంలోని వినాయక్‌నగర్‌లోని బస్వాగార్డెన్‌లో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బెల్ట్‌లతో పాటు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల క్రీడలకు సమయం కేటాయించేలా చూడాలన్నారు. కోచ్ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంతో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదుగుతురన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ మనోజ్, తల్లిదండ్రులు, క్రీడాకారులకు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అపురూపం.. సమ్మేళనం..



తాళ్లరాంపూర్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్‌లో 1996–97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాళ్లరాంపూర్ ఉన్నత పాఠశాలలో తమకు అప్పట్లో చదువు చెప్పిన గురువులకు సన్మానించారు. ఒకరినొకరు క్షేమసమాచారం తెలుసుకున్నారు. – మోర్తాడ్

వంతెన పునర్నిర్మాణం పూర్తి



మోర్తాడ్(బాల్కొండ) : పాలెం, ధర్మోరాల మధ్య ఉన్న పెద్దవాగులో వంతెన పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చెక్‌డ్యాంతో పాటు కాజ్‌వే నిర్మించగా నీటి ఉధృతికి వంతెన కుంగిపోయింది. తాత్కాలిక మరమ్మతులు చేసినా ఫలితం లేకపోయింది. చెక్‌డ్యాంపై నుంచి నీటి ప్రవాహం తగ్గడంతో వంతెన నిర్మాణం పనులను మొదలు పెట్టారు. చెక్‌డ్యాంపై నుంచి ప్రవహించే నీటిని వాగులో ఎలాంటి ఒత్తిడి లేకుండా వెళ్లిపోయే విధంగా రింగులను ఏర్పాటు చేశారు. రింగులపై వంతెనను నిర్మించారు.

ఇరువర్గాల మధ్య భూ వివాదం



తండావాసులను సముదాయిస్తున్న ఎస్సై

జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్ గ్రామ శివారులో చాంద్‌మియాబాగ్, కేశ్‌పల్లి తండా ప్రజల మధ్య అసైన్డ్ భూవివాదం ఉద్రిక్తతకు దారితీసింది. మండలంలోని పడకల్ శివారులో గతంలో 1116 సర్వే నెంబర్‌లో పడకల్‌కు చెందిన ముగ్గురికి, చాంద్‌మియాబాగ్‌కు చెందిన బాదవత్ సునీతకు ప్రభుత్వం భూ పంపిణీ పథకం ద్వారా పట్టాలు మంజూరు చేసింది. మోకా కూడా చూపించారు. అయితే కేశ్‌పల్లి తండా వాసులకు కూడా ఇదే సర్వే నెంబర్‌లో గతంలోనే తమకు పట్టాలు ఇచ్చారని ఆరోపిస్తూ కేశ్‌పల్లి తండా వాసులు పనులను అడ్డుకున్నారు. కాగా ఆదివారం చాంద్‌మియాబాగ్‌కు చెందిన బాదవత్ సునీత తరుపున చాంద్‌మియాబాగ్ తండావాసులు పెద్ద సంఖ్యలో భూమి వద్దకు తరలివచ్చారు. విషయం తెలుసుకున్నా కేశ్‌పల్లి తండా వాసులు ఈ భూమి తమదేనంటూ భూమిలో పని చేస్తున్న ట్రాక్టర్ పనులను అడ్డుకున్నారు. గతంలో ఈ సర్వే నెంబర్‌లో తమకు పట్టాలు ఉన్నాయని వారు ఆరోపించారు. రెండు తండా ప్రజలు ఒక దగ్గర గుమిగూడడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. స్థానిక ఏఎస్సై సుశీల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బృందం అక్కడి చేరుకుని ఇరువురిని సముదాయించారు. రెవెన్యూ అధికారులతో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. రెవెన్యూ అధికారులు పరిష్కరించే వరకు ఎవరు కూడా ఈ భూమిలోకి రాకూడదని సూచించారు.

జింకను అప్పగించిన తండావాసులు



నవీపేట : మండలంలోని విఠలేశ్వర్ తండాలో ఆదివారం సాయంత్రం చుక్కల జింక కనిపించింది. అడవి ప్రాంతం నుంచి తండాకు వచ్చిన చుక్కల జింకను తండాలోని కుక్కలు వెంబడించాయి. దీనిని గమనించిన తండాకు చెందిన రవీందర్ కుక్కల బారి నుంచి జింకను రక్షించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారమివ్వగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పద్మారావ్, బీట్ ఆఫీసర్ జెహ్రాలు తండాకు చేరుకుని చుక్కల జింకను స్వాధీనం చేసుకున్నారు.

క్రైం కార్నర్

నీటికుంటలో పడి బాలుడి మృతి

విషాదం నింపిన పండుగ



సుధీర్ మృతదేహం

ధర్పల్లి : ప్రమాదవశాత్తు ఓ బాలుడు నీటి కుంటలో పడి మృతి చెందిన సంఘటన ధర్పల్లి మండలం మరియా తండాలో చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ఇలా మండలంలోని మరియా తండాకు చెందిన బాధావత్ రాజు, సుజాతకు ఇద్దరు కుమారులు. తండాలోని ఆలయం వద్ద సమీప బంధువులు పండుగ చేయడంతో బాదావత్ సుజాత తన ఇద్దరు పిల్లలను తీసుకొని ఆలయం వద్దకు వెళ్ళింది. ఆమె పెద్ద కుమారుడు బాదావత్ సుధీర్ (6) ఆడుకుంటూ వెళ్లి ఆలయం సమీపంలో ఉన్న నీటి కుంటలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయి మృతి చెందాడు. బాలుడు కనిపించకపోవడంతో తల్లి సుజాత చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతగ్గా బాలుడు నీటి కుంటలో శవమై కనిపించాడు. బాలుడు తండ్రి ఉపాధి కోసం గల్ఫ్ దేశం వెళ్లారు. బాలుడు తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. బాలుడు మృతి చెందడంతో తండాలో విషాదం నెలకొంది.

చికిత్స పొందుతూ ఒకరు..

మాచారెడ్డి : చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన మాచారెడ్డి మండల కేంద్రంలో జరిగింది. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండల కేంద్రానికి చెందిన తోట పెద్దోల్ల నర్సింలు (37) ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తితో గతనెల 27న క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై వివరించారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

బాన్సువాడ రూరల్ : మండలంలోని తాడ్కోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రమాను కుచ్చకు చెందిన పిల్లి సాయిలు(45) ఆదివారం గ్రామ చెరువు కట్ట వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మృతుని భార్య పిల్లి గౌరవ్వ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. పిల్లి సాయిలు మద్యానికి బానిసై తనతో పాటు పిల్లలను వేధించేవాడన్నారు. ఏడాది క్రితం ఎరుకలి సాయిలు హత్యకేసులో జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చాడన్నారు. బెయిల్‌పై వచ్చిననాటి నుంచి తాను చనిపోతానని, బతకాలని లేదని అంటుండేవాడన్నారు. ఇదే క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 1న రాత్రి ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆదివారం ఉదయం గ్రామస్తుల ద్వారా తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందన్నారు. తన భర్త మృతిపై ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుని బాబు, పాప ఉన్నారు.

అదృశ్యమైన బాలిక నాందేడ్‌లో ప్రత్యక్షం

మాక్లూర్ : మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన ఓ బాలిక అదృశ్యం కాగా పోలీసుల చొరవతో క్షేమంగా తల్లితండ్రుల వద్దకు చేరింది. గ్రామస్తుల కథనం మేరకు.. చిక్లి గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక స్థానికంగా 7వ తరగతి చదువుతుంది. శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులెవరో చాక్లెట్ ఇచ్చి మత్తులోకి జారుకోగానే కిడ్నాప్ చేసి తీసుకెళ్లినట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

తల్లితండ్రులు పలుచోట్ల వెతికి వెంటనే పోలీసులకు ఫిర్యా దు చేశారు. బాలిక వద్ద ఫోన్ ఉండటంతో సిగ్నల్ ఆధారంగా నాందేడ్ రైలులో ఉన్నట్టు గర్తించారు. అ క్కడి పోలీసులను మాక్లూర్ పోలీసులు అప్రమత్తం చేశారు. నాందేడ్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగిన వెంటనే బాలికను పోలీసులు పట్టుకుని మాక్లూర్ పోలీసులకు అప్పగించారు. అదేరోజు తల్లితండ్రులకు అప్పగించి ఆదివారం రాత్రి బాలికను మాక్లూర్ పో లీసులు విచారించారు. చదువుకోవటం ఇష్టంలేక నాందేడ్‌లో ఉండే అమ్మమ్మ ఇంటికి వెళ్లినట్లు పోలీసుల ఎదుట బాలిక చెప్పినట్లు సమాచారం.

ఘనంగా శతాధిక వృద్ధురాలి జన్మదినం



శతాధిక వృద్ధురాలి జన్మదినం నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు



మూడోతరం మనవడితో లక్ష్మమ్మ

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని మంచిప్ప గ్రామంలో మునగంటి లక్ష్మమ్మ అనే శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకలు కుటుంబసభ్యుల నడుమ ఆదివారం ఘనంగా నిర్వహించారు. అదే సమయంలో మూడో మనువడికి వెండి గిన్నెతో పాలు పట్టించే కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా లక్ష్మమ్మ వందేళ్ల సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. వందేళ్లు పూర్తి చేసుకున్నప్పటికీ లక్ష్మమ్మ తన పని తానే చేసుకుంటుందని, మూడోతరం మనువడిని చూసి ఎంతో సంతోషంగా ఉందని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మమ్మ కుమారులు వెంకటి, లచ్చయ్య, వారి కుమారులు, కుమార్తెలు, మనువళ్లు, మనువరాళ్లు, మునిమనువళ్లు, ముని మనువరాళ్లు పాల్గొన్నారు.

మృతదేహం వద్దే పదిగంటలు..

- మూడేళ్ల బాలుడి అరణ్యరోదన
- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి.. అడవిలో రాత్రంతా అక్కడే బాలుడు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



తల్లితో బాలుడు నితిన్

ఇందల్వాయి : అటవీ ప్రాంతంలో రాత్రి సమయంలో తండ్రి మృతదేహం పక్కన ఏకంగా పది గంటలపాటు గడిపిన మూడేళ్ల కొడుకు.. తలుచుకుంటేనే ఒళ్లు గగుర్పొడిచే ఈ సంఘటన దగ్గి అటవీప్రాంతంలో జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ ఇందల్వాయి పర్యటనలో భాగంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఇంద ల్వాయి మండలం వెంగల్‌పాడ్‌కు చెందిన మాలవత్ రెడ్డి (34) గత జూన్ నెల 21న తన మేనమామ చంద్రును యాచారంలో దింపేందుకు తన కొడుకు నితిన్(3)తో కలిసి బైక్‌పై వెళ్లాడు. చంద్రును యాచారంలో దింపి తిరుగు ప్రయాణమైన రెడ్డి బైక్‌ను అజాగ్రత్తగా నడపడంతో దగ్గి అటవీ ప్రాంతంలో సుమారు రాత్రి 8 గంటల ప్రాంతంలో దర్గా వద్ద బారికేడ్‌కి ఢీకొట్టి ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన రెడ్డి ఘటనాస్థలంలోనే మృతి చెందగా అతడి కొడుకు నితిన్ ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. కాని రాత్రి సమయంలో వారిని ఎవరూ గమనించకపోవడంతో ప్రమాద సమాచారం ఎవరికీ తెలియలేదు. ఇంటి నుంచి రెడ్డికి ఫోన్లు వస్తున్నప్పటికీ వాటిని లిఫ్ట్ చేసి సమాధానం చెప్పలేని వయస్సు నితిన్‌ది. దీంతో ఏమి చేయాలో తోచని పసిబాలుడు నితిన్ తండ్రి మృతదేహం వద్దే ఉదయం ఆరు గంటల వరకు ఉన్నాడు. ఉదయం అక్కడ ఉన్న ఓ ఆలయ పూజారి రోడ్డు దాటుతుండగా నితిన్‌ని గమనించి అక్కడకు వెళ్లగా రెడ్డి మృతి చెంది ఉన్నాడు. నితిన్ ఏడుస్తూ కనిపించాడు.

ఇంటినుంచి ఫోన్లు వస్తుండటంతో ఫోన్ లిఫ్ట్ చేసి ప్రమాదం గురించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించాడు. అంత రాత్రి సమయంలో అటవీ ప్రాంతంలో ఏకంగా పది గంటలకు పైగా తండ్రి మృతదేహం వద్ద దీనస్థితిలో గడిపిన నితిన్‌ని చూసి ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ చలించిపోయారు.

బైక్ చోరీ

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన పంతె మహిపాల్‌కు చెందిన బైకు చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం టీఎస్ 17ఏ8375 ప్యాషన్ ప్రో బైక్‌ను గ్రామ శివారులో ఎక్కపల్లి తండాకు వెళ్లే రోడ్డు పక్కన పెట్టి పొలానికి వెళ్లాడు. తన బైక్ తాళాలు బైక్ ట్యాంకు కవర్‌లో పెట్టి వెళ్లి సాయంత్రం 6 గంటల ప్రాంతంలో వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. బైక్ చోరీకి గురైందని గుర్తించి ఆదివారం లింగంపేట పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాక్షి కామారెడ్డి

ఆదివారం । 2 । జూలై । 2023



సీఎంఆర్ఎఫ్‌తో భరోసా

సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు ఆర్థిక భరోసా లభిస్తోందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు.

- 9లో ▸



పెట్టుబడి భారం

రైతులకు పంటల సాగు పెట్టుబడులు భారంగా మారుతున్నాయి. ఆరుగాలం శ్రమకు ఫలితం దక్కడం లేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.1/23.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఉదయం శీతలగాలులు వీస్తాయి. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఈనెలాఖరు వరకు 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుశాఖ అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించరాదని పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్ విజయవంతం చేయాలి'



దోమకొండ: గ్రామాల్లో స్వచ్ఛసర్వేక్షణ్ పనులు పూర్తి చేయాలని డీపీవో శ్రీనివాస్‌రావ్ ఆదేశించారు. శనివారం ఆయన మండల కేంద్రంలో పర్యటించి, స్వచ్ఛసర్వేక్షణ్ కింద చేపట్టిన ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ టాయిలెట్స్‌ను పరిశీలించారు. దొమకొండతోపాటు అంబారిపేటలో స్వచ్ఛ సర్వేక్షణ్ పనులను పరిశీలించడానికి ఈనెల చివరలో కేంద్ర బృందం వస్తుందని తెలిపారు. అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా తడిపొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ నల్లపు అంజలి, ఉప సర్పంచ్ గజవాడ శ్రీకాంత్, డీఎల్‌పీవో సాయిబాబా, ఎంపీవో తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్ ఉన్నారు.

ఐఐటీలలో సీట్లు సాధించిన 'గిరిజన' విద్యార్థులు





మాలోత్ చరణ్‌సింగ్ రాములు నాయక్



రాజేందర్

గాంధారి: మండలంలోని గిరిజన బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో చదివిన ముగ్గురు విద్యార్థులు ఐఐటీల్లో సీట్లు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ అమర్ సింగ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గాంధారి మండలం లొంక తండాకు చెందిన మాలోత్ చరణ్‌సింగ్ ఖరగ్‌పూర్ ఐఐటీలో, సదాశివనగర్ మండలం యాచారం తండాకు చెందిన మాలోత్ రాజేందర్ నాగ్‌పూర్‌లో, మహబూబ్‌నగర్ జిల్లా వందర్ తండాకు చెందిన జాట్రోత్ రాములు నాయక్ ఇండోర్ ఐఐటీలో సీట్లు పొందారని పేర్కొన్నారు. వీరు జేఈఈ ఫస్ట్ ఫేస్‌లోనే ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు.

7 నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాప్‌ల ద్వారా ఈనెల 7వ తేదీనుంచి బియ్యం పంపిణీ చేయనున్నట్లు జిల్లా సివిల్ సప్లై అధికారి పద్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆహార భద్రత కార్డులలో పేరున్న ఒక వ్యక్తికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందిస్తామని పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

కామారెడ్డి అర్బన్: తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్స్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆదివారంతో గడువు ముగియనుంది. రూ. 3 లక్షలలోపు వార్షికాదాయం ఉన్న ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 9న రాత పరీక్ష నిర్వహించి, శిక్షణకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



రాజంపేట: మండల కేంద్రానికి చెందిన పలువురు మహిళలు శనివారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు భద్రత ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాదవరెడ్డి, నాయకులు ఇలియాస్, బాలకిషన్, అంకం క్రిష్టారావ్, గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

గుండెలో కల్లోలం!



- కుప్పకూలిపోతున్న యువత
- క్షణాల్లో ఆగిపోతున్న ఊపిరి
- అవగాహన లేక గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- 'గుండెపోటు' మరణాలపై నేడు కామారెడ్డిలో సెమినార్
- అవగాహన కల్పించనున్న సీనియర్ వైద్యులు

❖ లింగంపేట మండలం సురాయిపల్లి జగదాంబతండాకు చెందిన ప్రశాంత్ (20) రాత్రి భోజనం అనంతరం పడుకున్నాడు. రాత్రి నిద్రలోనే గుండెపోటుకు గురై చనిపోయాడు.

❖ పెద్దకొడప్‌గల్ మండలం వడ్లం గ్రామానికి చెందిన చాకలి లక్ష్మణ్ (21) బంధువుల ఇంటికి వెళ్లాడు. ఉన్నట్టుండి ఛాతీలో నొప్పంటూ విలవిల్లాడాడు. వెంటనే అతడిని ఎల్లారెడ్డిలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించాడు.

❖ బాన్సువాడకు చెందిన వీరేశం (35) మార్కెట్ కమిటీ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. రోజులాగే ఉదయం డ్యూటీకి వెళ్లిన వీరేశం.. ఛాతీలో నొప్పి వస్తుందని అక్కడి సిబ్బందికి చెప్పడంతో వారు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడికి వెళ్లేలోపే చనిపోయాడు.

❖ లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డికి చెందిన రాజం (36) తన స్నేహితులతో కలిసి వీధి భాగోతం ఆడాడు. తన పాత్ర అయిపోయాక దుస్తులు మార్చుకుంటూ.. ఛాతీలో నొప్పంటూ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయి కన్నుమూశాడు.

❖ మాచారెడ్డి మండలం కాకులగుట్ట తండాలో బూక్య భాస్కర్ (37) పొలం వద్ద నున్న విద్యుత్ స్తంభం ఎక్కి వైర్లను సరిచేస్తుండగా గుండెపోటుతో కింద పడిపోయాడు. ఆస్పత్రికి తరలించేసరికే చనిపోయాడు.

❖ భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన రాజమల్లు (45) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే రాత్రి అన్నం తిని పడుకున్నాడు. తెల్లవారు జామున గుండెలో నొప్పంటూ కుటుంబ సభ్యులను లేపాడు. వెంటనే అతడిని కామారెడ్డిలోని ఆస్పత్రికి తీసుకురాగా.. వైద్యులు పరీక్షిస్తుండగానే మృతిచెందాడు.

❖ రామారెడ్డి మండలం గిద్ద గ్రామానికి చెందిన దార రాజయ్య (45) కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మెట్లు దిగుతుండగా ఛాతీలో నొప్పి రావడంతో అక్కడే కూర్చున్నాడు. క్షణాల్లో కన్నుమూశాడు.

❖ బిచ్కుందకు చెందిన పోకుల శ్రీకాంత్ (45) ఉదయం టిఫిన్ తిన్న తర్వాత ఛాతీలో నొప్పి అంటూ కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించేలోపే మృత్యువాతపడ్డాడు.

సాక్షి, కామారెడ్డి: క్షణం ఆగకుండా పనిచేసే గుండె విషయంలో జనం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం ప్రాణాల మీదికి తెస్తోంది. దీంతో వయసుతో సంబంధం లేకుండా.. పల్లె, పట్నం తేడా లేకుండా చాలామంది గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. అకస్మాత్తుగా ఛాతీలో నొప్పితో విలవిల్లాడుతూ ఉన్నచోటనే కుప్పకూలిపోతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గుండెనొప్పిపై అవగాహన లేకపోవడంతో ఆస్పత్రులకు తరలించేలోపే పలువురు మృత్యువాత పడుతున్నారు.

యువతలోనే అధికం..

ఇటీవలి కాలంలో అత్యధిక మరణాలు గుండె సంబంధిత వ్యాధుల మూలంగానే సంభవిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, మత్తు పదార్థాలు అధిక మోతాదులో తీసుకోవడం, ధూమపానం, ఒత్తిడికి గురికావడం తదితర కారణాలతో గుండెపోటు వస్తోంది. అయితే ఒకప్పుడు గుండెపోటు, రక్తపోటు, మధుమేహం వంటి అసంక్రమిత వ్యాధులు యాభై ఏళ్లు దాటిన వారిలోనే కనిపించేవి. కానీ ఇటీవల యువతే ఎక్కువగా ఆయా వ్యాధుల బారిన పడుతున్నారు. ఇరవై ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వారే ఎక్కువగా గుండెపోటుతో మరణిస్తుండడంతో ఆందోళన కలిగిస్తోంది. గుండె జబ్బులు రావడానికి బీపీ, మధుమేహం పెరగడమే కారణమని వైద్యులు చెబుతున్నారు.

నిర్లక్ష్యంతో..

ఆరోగ్య సమస్య ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. కానీ చాలామంది ఆస్పత్రులకు వెళ్లకుండా అసిడిటీ అనో.. మరో సమస్య అనో తాత్కాలికంగా మందులు వాడుకుని వదిలేస్తున్నారు. ఫలితంగా సమస్య తెలియకుండాపోయి గుండెపోటుకు దారితీస్తోందని వైద్యులు అంటున్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ విషయాలపై సరైన అవగాహన లేకపోవడంతో చాలా మంది నిర్లక్ష్యం చేస్తున్నారు. కొందరు తాను బాగానే ఉన్నాననే భ్రమలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా ఆకస్మిక మరణాలు సంభవిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి వెళ్తే ఆరోగ్యాన్ని మెరుగుపరచుకునే అవకాశాలు ఉంటాయంటున్నారు.

నేడు సెమినార్..

గుండె సంబంధిత వ్యాధులతో ప్రజలు మృత్యువాతపడుతున్న నేపథ్యంలో.. గుండెపోటు మరణాలపై అవగాహన కల్పించేందుకు సెమినార్ నిర్వహించాలని కామారెడ్డి సిటిజన్స్ అసోసియేషన్ నిర్ణయించింది. ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రంలోని సాందీపని కళాశాలలో సెమినార్ ప్రారంభమవుతుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ అశోక్ వెంకటనర్సు పాల్గొని గుండెపోటుపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ప్రజలు పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

పదవీ విరమణ పొందిన సీడీఎంఏకు సన్మానం



సత్యనారాయణను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ దేవేందర్

కామారెడ్డి టౌన్: జిల్లా మొదటి కలెక్టర్‌గా విధులు నిర్వహించి, ప్రస్తుతం సీడీఎంఏగా పని చేస్తున్న సత్యనారాయణ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ దేవేందర్ పాల్గొన్నారు. ఆయన సత్యనారాయణను సన్మానించారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి



ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రిని కలిసిన కాంట్రాక్టు అధ్యాపకులు

భిక్కనూరు: రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న 1,300 మంది ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు కోరారు. ఈ విషయమై శనివారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణగుప్తా, తెయూ టీచర్స్ అధ్యక్షుడు దత్తహరి, ప్రతినిధులు శరత్, నాగేశ్వరరావు, గంగ కిషన్, కిరణ్ రాథోడ్, సురేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- ఒకరి మృతి, ఎనిమిది మందికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- బాధితులు బిహార్‌కు చెందిన హమాలీలు



లారీని ఢీకొన్న బొలెరో వాహనం



క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

బాల్కొండ : నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం వేంపల్లి శివారులో జాతీయ రహదారి 44 పై శనివారం తెల్లవారు జామున లారీని బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఎనిమిది మందికి గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కేంద్రంగా కోళ్ల పౌల్ట్రీ ఫారాలలో పని చేస్తున్న తొమ్మిది మంది బీహార్ కూలీలు సొంత గ్రామాలకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బొలేరో వాహనం డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యం వలన వెనుక నుంచి అతి వేగంగా రన్నింగ్‌లో ఉన్న లారీని ఢీ కొట్టింది. బొలేరో లారీ కిందకు చొచ్చుకుపోయింది. దీంతో బోలేరో డ్రైవర్ శ్యాంసుందర్ యాదవ్‌కు, ఆయన పక్కన కుర్చున్న హమాలీల మొకాద్దం (హమాలీలో పెద్ద) గోమర్తి రాజు (39)కు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న వాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. వీరందరిని నేషనల్ హైవే అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించగా రాజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉన్న డ్రైవర్ శ్యాంసుందర్ యాదవ్‌ను ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ముప్కాల్ ఎస్సై భాస్కర్ చారి తెలిపారు.

కామారెడ్డిలో భారీ వర్షం

సాక్షి, కామారెడ్డి: జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోనూ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. ఇన్నాళ్లు వర్షాలు లేకపోవడంతో పాటు ఎండలు మండుతుండడంతో ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వర్షం కాస్త ఉపశమనాన్ని కలిగించింది. వర్షం కురవడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ప్రశాంతంగా గ్రూప్ -4 పరీక్ష

- 86.88 శాతం మంది హాజరు
- గుర్తింపు కార్డు తీసుకురాని వారిని అనుమతించని అధికారులు
- ఆలస్యంగా వచ్చి.. నిరాశతో వెనుదిరిగిన పలువురు అభ్యర్థులు

కామారెడ్డి టౌన్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో జిల్లాలో శనివారం నిర్వహించిన గ్రూప్ -4 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 86.88 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలో పరీక్ష రాయడానికి 16,101 మంది దరఖాస్తు చేసుకోగా వారికోసం అధికారులు 40 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 13,988 మంది అభ్యర్థులే పరీక్షకు హాజరయ్యారు. 2,113 మంది గైర్హాజరయ్యారు.

ఉదయం 9 గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. దీంతో పలు కేంద్రాల వద్ద భారీ క్యూలు కనపించాయి. చేతి గడియారాలు, బూట్లు, బెల్టులు, హ్యాండ్ బ్యాగులు, పర్సులతో వచ్చినవారినుంచి వాటిని తీసివేయించి, పరీక్షకేంద్రంలోకి అనుమతించారు. కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. సెంటర్‌ల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.



జిల్లా కేంద్రంలోని జీవదాన్ స్కూల్ వద్ద క్యూ



కామారెడ్డిలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న ఎస్సై



నిజామాబాద్‌లోని కాకతీయ సెంటర్‌లో అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సమయానికి రాకపోవడంతో..

ఉదయం 9.45 గంటల వరకే పరీక్ష కేంద్రంలోని అనుమతిస్తామని టీఎస్‌పీఎస్సీ ముందే స్పష్టం చేసింది. అయినా పలువురు అభ్యర్థులు ఆలస్యంగా సెంటర్‌లకు చేరుకున్నారు. వారికి నిరాశ తప్పలేదు. జిల్లా కేంద్రంలోని ఆర్కే డిగ్రీ కళాశాల సెంటర్‌కు ఆలస్యంగా చేరుకున్న నలుగురిని లోనికి అనుమతించలేదు. కామారెడ్డిలోని శ్రీగాయత్రి జూనియర్ కళాశాల వద్దకు ఆలస్యంగా వచ్చిన ఇద్దరు, దేవునిపల్లి హైస్కూల్ వద్ద ఒకరు, సాందీపని కళాశాల వద్దనుంచి ఒకరు నిరాశతో వెనుదిరిగారు. కొందరు గుర్తింపు కార్డులను తీసుకురావడం మర్చిపోయి పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయారు. సదాశివనగర్ మండలంలోని మర్కల్‌వద్దనున్న టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ సెంటర్‌కు ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకురాని ఐదుగురు అభ్యర్థులను వెనక్కి పంపారు. కష్టపడి చదివినా పరీక్ష రాయలేకపోతున్నందుకు బాధగా ఉందని పలువురు అభ్యర్థులు కంటతడిపెట్టుకున్నారు. మరోవైపు మహిళా అభ్యర్థులు తమ పిల్లలను భర్త, బంధువులకు అప్పగించి పరీక్ష రాయడానికి కేంద్రంలోనికి వెళ్లారు. పరీక్ష పూర్తై బయటికి వచ్చేంతవరకు వారిని లాలిస్తూ, ఆడిస్తూ గడిపారు. గ్రూప్ -4 పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



ఆలస్యంగా రావడంతో అవకాశం కోల్పోయి కంటతడి పెడుతున్న అభ్యర్థి

గోరింట.. ఆరోగ్య పంట!

- ఆషాఢంలో గోరింటాకుకు ఎంతో ప్రాధాన్యం
- మక్కువ చూపుతున్న మహిళలు

చేతులకు మైదాకు పెట్టుకుంటే ఆ అందమే వేరు. అందుకే మైదాకును ఇష్టపడని మగువలు ఉండరు. పండుగలు, పర్వదినాలు, శుభకార్యాల్లో మహిళలు మైదాకు పెట్టుకునేందుకు మక్కువ చూపుతారు. ఇది ఆచారంగానూ, సంస్కృతిలో భాగంగానూ వస్తోంది. ముఖ్యంగా ఆషాఢ మాసంలో మైదాకు పెట్టుకునేందుకు మహిళలు, యువతులు ఇష్టపడతారు. ఆషాఢంలో వర్షాలు పడడం, వాతావరణ మార్పులతో చర్మ వ్యాధులు, అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. గోరింటాకు పెట్టుకోవడం వల్ల ఈ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుందని భావిస్తారు.



బోధన్‌లో గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

సండే స్పెషల్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భారతీయ సాంప్రదాయంలో గోరింటాకుకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. తెలుగింట గోరింటాకు పెట్టుకునేందుకు మహిళలు ఉత్సాహం చూపుతారు. ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు 'గోరింటాకు వేడుకలు' సైతం నిర్వహించుకుంటున్నారు. పల్లెల్లో తప్పనిసరిగా ఈ వేడుకలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుత ఆషాఢ మాసంలో జిల్లాలోని బోధన్ పట్టణంలో వివిధ కాలనీల్లో మహిళలు ప్రత్యేకంగా గోరింటాకు ఉత్సవాలు నిర్వహించుకుంటున్నారు. అదేవిధంగా జిల్లాలోని అనేక పల్లెల్లో సైతం అందరూ ఒకచోట కూర్చుని గోరింటాకు పెట్టుకునే ఈ పురాతన సంస్కృతిని కొనసాగిస్తున్నారు. ఉత్తర భారతంలో ఉన్న మెహెందీ సంస్కృతిని ఇక్కడ వ్యాపారంగా మార్చినప్పటికీ స్థానిక పల్లెల్లో మాత్రం ఆషాఢం గోరింటాకు ఉత్సవాలకు మంచి ఆదరణ ఉంది. పెళ్లి పేరంటాలకు ఇక్కడ సైతం వివిధ రకాల కోన్లతో మెహెందీ ఫంక్షన్లు చేస్తున్నప్పటికీ ఆషాఢంలో మాత్రం చెట్టు నుంచి తెంపిన స్వచ్ఛమైన గోరింటాకును చింతపండు వేసి రుబ్బి చిన్నపిల్లలు, యువతులు, మహిళలు పెట్టుకుంటున్నారు. పల్లెల్లో చెట్ల నుంచి గోరింటాకు కోసుకొచ్చి పెట్టుకుంటుండగా, పట్టణాల్లో బహుళ అంతస్తుల నివాసాలు ఉన్నప్పటికీ పల్లెల నుంచి గోరింటాకు తెప్పించుకునే వారు సైతం బాగానే ఉంటున్నారు.

శాస్త్రీయ కారణాలు..

ఆషాఢ మాసంలో వర్షాలు కురవడం, గ్రామాల్లో మహిళలు వ్య వసాయ పనులకు వెళ్తుంటారు. దీంతో నీటిలో నానే పనులు ఎక్కువగా చేయాల్సి ఉంటుంది. దుస్తులు ఉతకడం, గిన్నె లు తోమడం లాంటి పనులతోపాటు గతంలో చెప్పు ల వాడకం తక్కువ ఉన్న రోజుల్లో బురద రోడ్లలో తిరగాల్సి వచ్చేది. నేపథ్యంలో గోర్లు పాడుకాకుండా, పాదాలు పుళ్లు పడకుండా ఉండేందుకు గృహవైద్యంగా గోరింటాకును పెట్టుకుంటారు. అలాగే చర్మ వ్యాధులు రాకుండా, గోళ్లు దెబ్బతినకుండా గోరింటాకు బాగా ఉపయోగపడుతుంది.

ఎంతో ప్రత్యేకత



ఆషాఢంలో గోరింటాకు పెట్టుకుని మురిసిపోతూంటాం. ఈ మాసంలో గోరింటాకుకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. గోరింటాకు పెట్టుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు కూడా రావు.

– నందకుమారి, వెంకటేశ్వరకాలనీ, బోధన్

ఆషాఢంలో వేడుక..



ఆషాఢంలో గోరింటాకు వేడుక చేసుకుంటాం. మహిళలు తమ సౌభాగ్యంకోసం ఈ మాసంలో గోరింటాకును పెట్టుకుంటారు. మా కాలనీలో ఏటా ఈ వేడుకను సంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్నాం.

– సౌమ్య, బోధన్

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఇన్‌చార్జి సీపీ



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన గ్రూప్–4 పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. కమీషనరేట్ పరిధిలో 125 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బందోబస్తులో డీసీపీ(అడ్మిన్), ఏసీపీలు ముగ్గురు, సీఐలు, ఆర్ఐలు 19 మంది, ఎస్సైలు, ఆర్ఎస్సైలు 48 మంది, ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు 64 మంది, పోలీస్‌కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు 140 మంది, మహిళ సిబ్బంది 83 మంది, ఇతర విభాగాలకు చెందిన 48 మంది పాల్గొన్నట్లు చెప్పారు.

3 నుంచి పీజీ సెకండియర్ పరీక్షలు

సుభాష్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీలో పీజీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్నాయని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యయన కేంద్ర రీజినల్ కోఆర్డినేటర్ కె రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వారి హాల్‌టికెట్లను నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, దాంతోపాటు వారి ఫొటోతో ఉన్న గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు అరగంట ముందే పరీక్షాకేంద్రానికి చేరుకోవాలన్నారు.

పోలీసులకు శిక్షణ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ డివిజన్‌లోని పోలీస్, ఎక్సైజ్ అధికారులకు నిజామాబాద్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేష్ గౌడ్ శనివారం అవగాహన కల్పించారు. పంచనామా, చార్జిషీట్, రిమాండ్ రిపోర్టులు కోర్టులో దాఖలు చేసే విధానం గురించి వివరించారు. ప్రాసిక్యూటర్ రహీమొద్దీన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవిరాజ్, కవితారెడ్డి, ఎక్సైజ్ ఆఫీసర్ సింధు, టాస్క్‌ఫోర్స్ ఆఫీసర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సహకార కాంగ్రెస్‌కు డీసీసీబీ చైర్మన్



సుభాష్‌నగర్ : ఢిల్లీలో జరుగుతున్న 17వ జాతీయ సహకార కాంగ్రెస్‌కు ఎన్ఏఎఫ్ఎస్‌సీఓబీ, టీఎస్ క్యాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, సహకార చైర్మన్లతో కలిసి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి శనివారం హాజరయ్యారు. కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన సిరిపోర్ట్ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు సదస్సు జరుగనుంది. సదస్సును శనివారం ప్రధాన మంత్రి మోదీ ప్రారంభించి ప్రసంగించారు.

ప్రశాంతంగా గ్రూప్ 4 పరీక్ష



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఉమ్మడి జిల్లాలో గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పలువురు మహిళలు చిన్నారులతో పరీక్ష కేంద్రాలకు వచ్చారు. వారు పరీక్ష రాయడానికి వెళ్లగా కుటుంబ సభ్యులు చిన్నారులను ఆడించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్/ కామారెడ్డి టౌన్





పరీక్ష కేంద్రానికి వెళ్తున్న అభ్యర్థులు



నిజామాబాద్‌లోని కాకతీయ పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు



నిజామాబాద్ ఎస్ఎస్ఆర్ కళాశాల వద్ద అభ్యర్థులను చెక్ చేస్తున్న అధికారులు



కామారెడ్డిలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థి



కామారెడ్డిలో..



కామారెడ్డిలో ఆధార్‌కార్డు లేకపోవడంతో సెంటర్ బయట ఉన్న మహిళ

పిల్లలకు పరీక్ష







నిజామాబాద్ నగరంలో..







కామారెడ్డిలో..

రైతులకు పెట్టుబడి భారం

- పెరుగుతున్న సాగు ఖర్చులు
- ఆందోళనలో అన్నదాతలు



బాన్సువాడ: యాసంగిలో బాన్సువాడకు చెందిన రైతు గంగారం నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని పంట సాగు చేశాడు. పెట్టుబడి డబ్బులు పోను తనకు ఇంకా రూ.24 వేలు నష్టం వచ్చింది. దీంతో వానాకాలం సాగుకు ఆసక్తి చూపడం లేదు. వ్యవసాయంలో పెట్టుబడి ఏటేటా పెరుగుతోంది. దీంతో గిట్టుబాటు కాక అన్నదాత అవస్థలు పడుతున్నాడు. ట్రాక్టర్ల యజమానులు కిరాయిలు పెంచారు. ప్రస్తుతం రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతుండగా ధరల మోతతో ఆందోళన చెందుతున్నారు. ఏటేటా పెట్టుబడి భారం కావడంతో పంట సాగు చేయడానికి ఆసక్తి కనబర్చడం లేదు. దీనికి తోడు అకాల వర్షాలు, పంటకు తెగుళ్ల బెడద తదితర ఇబ్బందులను రైతులు ఎదుర్కొంటున్నారు. విత్తనాలు, ఎరువుల ధరలు, కూలీల రేట్లు ఎక్కువగా ఉండడంతో రైతుల ఆర్థిక పరిస్థితి ఇబ్బందులను గురి చేస్తోంది. చాలా మంది రైతులు ట్రాక్టర్లనే వ్యవసాయ పనులకు ఉపయోగిస్తున్నారు. ఏడాది క్రితం ఎకరానికి సాలుకు రూ.800 నుంచి రూ.1000 వరకు వసూలు చేసిన ట్రాక్టర్ యజమానులు ప్రస్తుతం ఎకరానికి రూ.1300 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా ఒక్కసారి పంట సాగు చేయాలంటే ఎకరానికి నాలుగు సార్లు దుక్కి, దమ్ము చేయాల్సి ఉంటుంది. ఇలా రైతులపై తీవ్ర భారం పడుతుంది. పంటకు విత్తనం నాటిప్పటి నుంచి పంట కోత దశ వరకు పెట్టుబడికి కావాల్సిన డబ్బుల కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అయిన అప్పు పుట్టని స్థితి. కొందరు వడ్డీ వ్యాపారులు రైతులకు అంటేనే అప్పు ఇవ్వమని మోకంపై తేల్చి చెబుతున్నారు. మరి కొంత మంది వడ్డీ వ్యాపారులు వ్యవసాయ భూములను సెల్‌డీడ్ చేసుకుని రూ. 3 నుంచి రూ. 5 వరకు వడ్డీ వసూలు చేస్తు అప్పు ఇస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో రైతులు అప్పులు చేయాల్సి వస్తుంది. ఎరువుల దుకాణాల్లో ఉద్దెరకు ఎరువులను కొనుగోలు చేస్తే పంట విక్రయించిన తర్వాత వడ్డీతో సహా ఎరువుల డబ్బులను వసూలు చేస్తున్నారు.

రూపాయి మిగలలేదు

యాసంగిలో వడగళ్ల వర్షాల కారణంగా పంటలు పూర్తిగా నష్టపోయాం. ఈ సారి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. రెండెకరాలను కౌలు తీసుకుని వ్యవసాయం చేశాను. కౌలు చేసిన పాపానికి రూపాయి మిగలలేదు. తిరిగి నష్టపోవాల్సి వచ్చింది. ఎక్కడైనా జీతం ఉంటే నెలకు కనీసం రూ.20 వేలు సంపాదించే వాణ్ణి. ఇకపై పంట సాగు జోలికి వెళ్లను.

– సాయిలు, రైతు, బాన్సువాడ

వేకువజాము నుంచే ఇసుక దందా

- అధికారులు రాకముందే తరలిస్తున్న వైనం




ఉదయం ఏడు గంటలకే మోర్తాడ్ జాతీయ రహదారి వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం సుంకెట్‌లో ఇసుక మాఫియా రాజ్యం ఏలుతోంది. ఇసుక పాయింట్ నుంచి రవాణా ఆరంభించడానికి ఉదయం 9 గంటల తరువాత సమయం ఉన్నా వ్యాపారులు మాత్రం వేకువ జామునే ట్రాక్టర్లలో ఇసుకను నింపుకుని యథేచ్ఛగా తరలించడం మొదలు పెట్టారు. ఇసుక రవాణా విషయంలో ఎన్నో వివాదాలకు హేతువైన సుంకెట్ పాయింట్ నుంచి ఇసుకను రవాణా చేసే విషయంలో అధికారులు తప్పటడుగులు వేయడం వ్యాపారులకు కలిసి వస్తుంది. నిబంధనల ప్రకారం వే బిల్లులు రాసిన తర్వాతే ఇసుకను తరలించాల్సి ఉన్నా వ్యాపారులు మాత్రం అదేమి లెక్కచేయకుండా తమకు ఇష్టం వచ్చినట్లు రవాణా కొనసాగిస్తున్నారు. సుంకెట్‌కు చెందిన ముగ్గురు అధికార పార్టీ నాయకులే ఇసుక వ్యాపారులుగా అవతారం ఎత్తి తమకు తోచినట్లుగా దందా కొనసాగిస్తున్నారు. గ్రామంలో నుంచి ఇసుకను రవాణా చేయవద్దని కొందరు పౌరులు సూచించినా లెక్కచేయలేదు. అంతేకాకుండా ఇసుక రవాణా విషయంలో మరో మార్గం అనుసరిస్తే ఇతర గ్రామాల వాహనాలు వచ్చి తమకు ఎక్కడ పోటీ ఇస్తాయో అని ముగ్గురు వ్యాపారులు సందేహిస్తున్నారు. దీంతో ఇసుక పాయింట్‌పై తమ పెత్తనం కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సుంకెట్ ఇసుక పాయింట్‌పై సమగ్ర విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులతో ట్రాఫిక్ జామ్

- అడవి మామిడిపల్లి వద్ద మూడు గంటలు స్తంభించిన వాహనాలు



నిలిచిపోయిన వాహనాలు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద కొనసాగుతున్న రోడ్డు మరమ్మతుల కారణంగా 63వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం సుమారు 3 గంటలపాటు ట్రాఫిక్ జామ్ అయింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడ్డారు. అడవి మామిడిపల్లి వద్ద జాతీయ రహదారిపై రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ఇటీవల పూర్తయ్యాయి. ఈ పనులతో ఇరువైపులా సుమారు 2 కిలోమీటర్ల మేర రోడ్డు ధ్వంసమైంది. కాంట్రాక్టర్ రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నాడు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. శనివారం అటు అంకాపూర్, ఇటూ నిజామాబాద్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మాక్లూర్ ఎస్సై యాదగిరిగౌడ్ సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ట్రాఫిక్ క్లియర్ కావటానికి సుమారు 3 గంటలు పట్టింది. మరోవైపు రోడ్డు మరమ్మతు పనులను కాంట్రాక్టర్ నత్తనడకన చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని, పనులు వేగంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన



బోధన్: మండల న్యాయ సేవాధికార సంస్థ, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణ కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బోధన్ కోర్టు ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి రవి కుమార్ మాట్లాడారు. సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రుబి నా ఫాతిమా, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, పోస్టల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో అర్హుల జాబితా

సుభాష్‌నగర్: సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేసేందుకు 2019లో జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాలను డీఈవో నిజామాబాద్ వెబ్‌సైట్‌లో ఆదివారం ప్రదర్శిస్తామని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలోని అభ్యర్థులు సోమవారం ఉదయం 10 నుంచి కొత్త కలెక్టరేట్‌లోని హాల్‌నెంబర్ 117లో ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్ కాపీ తీసుకొచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన



ఆస్పత్రి బయట రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



మనుశ్రీ (ఫైల్)

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆందోళనలకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన రమేష్, హర్షికల మూడేళ్ల చిన్నారి మనుశ్రీ తీవ్రమైన జ్వరం, విరోచనాలతో బాధపడటంతో గ్రామంలోని వైద్యునికి చూపించారు. అయినా తగ్గకపోవడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని దర్శశాల పక్కన ఓ ప్రైవేట్ చిన్న పిల్లల దవాఖానాలో అడ్మిట్ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేస్తుండగానే చిన్నారికి శనివారం మధ్యాహ్నం ఫిట్స్ వచ్చింది. వైద్యులు తీవ్రంగా శ్రమించినా ఫలితం దక్కలేదు. అనంతరం చికిత్స పొందుతూ మనుశ్రీ మృతి చెందింది. చిన్నారి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రి ముందు ఆందోళన చేశారు. వైద్యులతో వాగ్వాదం చేశారు. పట్టణ పోలీసులు ఆందోళనకారులను సముదాయించారు. పాపను బతికించడానికి తాము తీవ్రంగా శ్రమించామని, తీవ్రమైన జ్వరం, ఫిట్స్ రావడం, మెదడులో రక్తం గడ్డకట్టడంతోనే చిన్నారి మృతి చెందిందని వైద్యులు చెప్పారు.

గుండెపోటుతో ఒకరు..



నరసింహ స్వామి(ఫైల్)

నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్ కాలనీకి చెందిన తిరునగరి నరసింహ స్వామి (45) గుండెపోటుతో శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో గుండెపోటుకు గురైనట్లు పేర్కొన్నారు. తోటి ఉద్యోగులు హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రుద్రూర్‌కు చెందిన వీఆర్ఏ..

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన వీఆర్ఏ గైని బాబు (55) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో వెక్కిళ్లు రావడంతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి పడిపోయాడు. చికిత్స నిమిత్తం సహచరులు వెంటనే బోధన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు గుండెపోటుతో మృతి చెందాడని చెప్పినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. తహసీల్దార్ ముజీబ్, రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపి, బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

సోయా చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

బిచ్కుంద: సోయాబీన్ దొంగలించి అమ్ముకున్న ఇద్దరిని పట్టుకొని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సిర్‌సముందర్ గ్రామంలో రైతు రవెళ్ల రవికుమార్ సోయాబీన్ గిట్టుబాటు ధర లేదని ఇంటి దగ్గర పాలీథీన్ కవర్లు కవర్లు కప్పి నిల్వ పెట్టుకున్నాడు. సోయా బస్తాలను హజ్గుల్‌కు చెందిన తుతురు లింగురాం, బిచ్కుందకు చెందిన మచ్కురీ విజయ్ ఎత్తుకెళ్లారు. కొన్ని రోజుల నుంచి ప్రతి రోజు బైక్‌పై రాత్రి సమయంలో సోయా బస్తాలు ఎత్తుకెళ్లారు. సుమారు 40 బస్తాలు చోరీ చేసి అమ్ముకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీ

ఇందల్వాయి: మండలంలోని గన్నారం శివారులో 44వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో శుక్రవారం రాత్రి దొంగలు పడ్డట్లు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. పది రోజుల క్రితం గుడి తలుపులు పగలకొట్టి సీసీ కెమెరాలు, టీవి ఎత్తుకెళ్లిన దొంగలు, ఈ సారీ కూడా తాళాలు ధ్వంసం చేసి హుండీలో ఉన్న డబ్బులు, ఆలయంలో ఉన్న ఇత్తడి గంటలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

లిబర్టీ హైస్కూల్ మూసివేత



సుభాష్‌నగర్: నగరంలోని పాత ఎన్‌జీవోస్ కాలనీ లోగల లిబర్టీ హైస్కూల్ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నందున ఎంఈఓ ద్వారా తాత్కాలికంగా మూసేసినట్లు డీఈఓ దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని ఫిర్యాదులు వచ్చిన విషయం తెలిసిందే. ఈవిషయాన్ని అందరూ గమనించాలని ఆయన పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన పది మంది రిమాండ్

రాజంపేట: రాజంపేటలో శుక్రవారం భూ తగాదాల్లో నాయిని శ్రీనివాస్‌పై దాడికి పాల్పడిన 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. నిందితులను శనివారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి 14 రోజుల రిమాండ్ విధించారని చెప్పారు.